02-10-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

" మధురమైన పిల్లలూ-ఇప్పుడీ మృత్యు లోకము అంతమయ్యే సమయము. అమరలోకము స్థాపనవుతూ ఉంది. కనుక మీరు మృత్యులోకంలోని వారిని స్మృతి చేయరాదు. "

ప్రశ్న :- తండ్రి తన పేద పిల్లలకు ఏ స్మృతిని ఇప్పిస్తున్నారు ?

జవాబు :- పిల్లలారా, మీరు వైస్‌లెస్(పవిత్రంగా) ఉన్నప్పుడు చాలా సుఖంగా ఉండేవారు. అప్పుడు మీ అంతటి ధనవంతులెవ్వరూ లేరు. మీరు అపారమైన సుఖంలో ఉండేవారు. భూమి, ఆకాశాలు మీ చేతిలో ఉండేవి. ఇప్పుడు తండ్రి మనలను మళ్ళీ ధనవంతులుగా తయారుచేసేందుకు వచ్చారు.

పాట :-నయనహీనులకు మార్గాన్ని చూపండి ప్రభూ!....( నయన్ హీన్ కో రాహ్ దిఖావో...)

ఓంశాంతి. మధురాతి మధురమైన ఆత్మిక పిల్లలైన ఆత్మలు పాట విన్నారు. ఇలా ఎవరన్నారు? ఆత్మలు ఆత్మిక తండ్రితో అన్నారు. ఆత్మిక తండ్రిని, ఆత్మిక పిల్లలు 'బాబా' అని పిలిచారు. వారిని ఈశ్వరుడని, తండ్రి అని కూడా అంటారు. ఎలాంటి తండ్రి ? పరమపిత. ఇద్దరు తండ్రులున్నారు. ఒకరు లౌకిక తండ్రి, మరొకరు పారలౌకిక తండ్రి. లౌకిక తండ్రి పిల్లలు పారలౌకిక తండ్రిని ఓ తండ్రీ! అని పిలుస్తారు. తండ్రి పేరేమిటి? శివుడు. ఆ నిరాకార శివుడే పూజింపబడ్తాడు. వారిని సుప్రీమ్ ఫాదర్ అని కూడా అంటారు. లౌకిక తండ్రిని సుప్రీమ్ అని అనరు. ఉన్నతాతి ఉన్నతమైనవారు, సర్వాత్మల తండ్రి ఒక్కరే. జీవాత్మలందరూ ఆ తండ్రినే స్మృతి చేస్తారు. మన తండ్రి ఎవరు? అని ఆత్మలు మర్చిపోయారు. ఓ గాడ్‌ఫాదర్, నయనహీనులైన మాకు నయనాలివ్వండి, అప్పుడు మేము మా తండ్రిని గుర్తించగలము అని పిలుస్తారు. భక్తిమార్గంలో మేము అంధులమై ఎదురుదెబ్బలు తింటూ వచ్చాము, ఇప్పుడు ఆ ఎదురుదెబ్బల నుండి విడిపించండి అని పిలుస్తారు. బాబాయే కల్ప-కల్పము వచ్చి భారతదేశాన్ని స్వర్గంగా చేస్తారు. ఇప్పుడిది కలియుగము.సత్యయుగము రానున్నది. కలియుగము మరియు సత్యయుగాల మధ్య సమయాన్ని సంగమయుగమని అంటారు. ఇది పురుషోత్తమ సంగమ యుగము. అనంతమైన తండ్రి వచ్చి భ్రష్టాచారులైన వారిని శ్రేష్ఠాచారులుగా,పురుషోత్తములుగాచేస్తారు.లక్ష్మీనారాయణులు పురుషోత్తములుగా ఉండేవారు. లక్ష్మీనారాయణుల రాజ్య వంశముండేది. భారతవాసులైన మీరు నేటికి 5 వేల సంవత్సరాల క్రితము స్వర్గవాసులుగా ఉండేవారు. ఇప్పుడు నరకవాసులుగా అయ్యారని తండ్రి వచ్చి స్మృతినిప్పిస్తారు. నేటికి 5 వేల సంవత్సరాల క్రితము భారతదేశం స్వర్గంగా ఉండేది. భారతదేశానికి చాలా మహిమ ఉండేది. బంగారు, వజ్రాల భవనాలుండేవి.ఇప్పుడు ఏమీ లేవు. ఆ సమయంలో వేరే ధర్మాలు ఉండేవి కావు. కేవలం ఒక్క సూర్య వంశము

మాత్రమే ఉండేది. తర్వాత చంద్ర వంశము వస్తుంది. మీరే సూర్య వంశీయులుగా ఉండే వారని తండ్రి అర్థం చేయిస్తున్నారు. ఇప్పటివరకు లక్ష్మీనారాయణుల మందిరాలను ఇంకా నిర్మిస్తూనే ఉన్నారు కానీ లక్ష్మీనారాయణుల రాజ్యము ఎప్పుడుండేదో, వారు ఎలా రాజ్యాన్ని పొందారో ఎవ్వరికీ తెలియదు. పూజ చేస్తున్నారు కానీ వారి గురించి తెలియదంటే అది అంధ విశ్వాసమే కదా. శివుడిని, లక్ష్మీనారాయణులను పూజిస్తారు కానీ వారి జీవితచరిత్ర ఎవ్వరికీ తెలియదు. భారతవాసులు స్వయంగా వారే 'మేము పతితులుగా ఉన్నాము' అని అంటారు. అందుకే ఓ పతితపావనా! తండ్రీరండి, వచ్చి మమ్ములను దు:ఖము నుండి, రావణ రాజ్యము నుండి విడుదల చేయండి అని పిలుస్తారు. తండ్రి వచ్చి అందరినీ ముక్తులుగా చేస్తారు. సత్యయుగంలో ఒకే రాజ్యముండేదని పిల్లలకు తెలుసు. మాకు మళ్ళీ రామరాజ్యము కావాలని కాంగ్రెస్‌వారు, గాంధీజీ కూడా అడిగేవారు. మనము స్వర్గవాసులుగా అవ్వాలని కోరుకుంటున్నాము. ఇప్పుడు నరకవాసుల పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నారా? దీనిని నరకము, ఆసురీ ప్రపంచమని అంటారు. ఇదే భారతదేశం ఒకప్పుడు దైవీ ప్రపంచంగా ఉండేది, ఇప్పుడు ఆసురీ ప్రపంచంగా తయారయింది.



మీరు 84 జన్మలు తీసుకున్నారు, 84 లక్షల జన్మలు కాదు అని తండ్రి అర్థం చేయిస్తున్నారు. శాస్త్రాలలో ఇలా(గొప్పగా) తప్పులు వ్రాసేశారు. నేటికి 5 వేల సంవత్సరాల క్రితం స్వర్గముండేది. అక్కడ భక్తిగానీ, దు:ఖానికి నామ-రూపాలు గానీ ఉండేవి కావు. దానిని సుఖధామమని అంటారు. బాబా చెప్తున్నారు - మీరు వాస్తవానికి శాంతిధామ

నివాసులు. ఇక్కడికి పాత్రను అభినయించేందుకు వచ్చారు. పునర్జన్మలు 84 మాత్రమే ఉంటాయి, 84 లక్షలు కాదు. ఇప్పుడు పిల్లలైన మీకు అనంతమైనవారసత్వమునిచ్చేందుకు అనంతమైన తండ్రి వచ్చారు. తండ్రి ఆత్మలైన మీతో మాట్లాడ్తారు. ఇతర సత్సంగాలలో మనుష్యులు మనుష్యులకు భక్తి విషయాలను వినిపిస్తారు. అర్ధకల్పము భారతదేశం స్వర్గంగా ఉన్నప్పుడు ఒక్కరు కూడా పతితులు ఉండేవారు కాదు. ఇప్పుడు ఒక్కరు కూడా పావనంగా లేరు. ఇది పతిత ప్రపంచము. తండ్రి అర్థం చేయిస్తున్నారు - గీతలో కృష్ణ భగవానువాచ అని వ్రాసేశారు. కృష్ణుడు భగవంతుడూ కాదు, అతను గీతనూ వినిపించ లేదు. ఈ జనులకు తమ ధర్మ శాస్త్రమేదో కూడా తెలియదు. తమ ధర్మాన్నే మర్చిపోయారు. ముఖ్యమైన ధర్మాలు నాలుగు. మొదట ఆది సనాతన దేవీ దేవతా ధర్మములోని సూర్య వంశము తర్వాత చంద్ర వంశము, రెండిటిని కలిపి దేవీ దేవతా ధర్మమని అంటారు. అక్కడ దు:ఖమనే మాటే లేదు. 21 జన్మలు మీరు సుఖధామంలో ఉండినారు. తర్వాత రావణరాజ్యము, భక్తిమార్గము ప్రారంభమౌతుంది. శివబాబా ఎప్పుడు వస్తారు? రాత్రి పూర్తి అయినప్పుడు, భారతవాసులు గాఢాంధకారములోకి వచ్చినప్పుడు తండ్రి వస్తారు. బొమ్మల పూజ చేస్తూ ఉంటారు. ఒక్కరి జీవితచరిత్ర గురించి కూడా తెలియదు. భక్తిమార్గంలో అనేక ఎదురుదెబ్బలు తింటారు, తీర్థ స్థానాలకు వెళ్తారు, ప్రదక్షిణలు చేస్తారు. ప్రాప్తి ఏమీ ఉండదు. బాబా చెప్తున్నారు - నేను వచ్చి మీకు బ్రహ్మ ద్వారా యదార్థ జ్ఞానాన్ని వినిపిస్తాను. మాకు సుఖధామము, శాంతిధామాల మార్గము చూపించమని నన్ను పిలుస్తారు. బాబా చెప్తున్నారు - నేటికి 5 వేల సంవత్సరాల క్రితం నేను మిమ్ములను చాలా ధనవంతులుగా చేశాను, ఎంత ధనమునిచ్చాను! దానిని మీరు ఎక్కడ పోగొట్టుకున్నారు? మీరు ఎంత శ్రీమంతులుగా ఉండేవారు. భారతదేశం అన్నిటికన్నా శ్రేష్ఠమైన ఖండముగా ఉండేది. వాస్తవానికి ఇది అందరికీ తీర్థ స్థానము. ఎందుకంటే పతితపావనులైన తండ్రి జన్మించిన స్థానము. అన్ని ధర్మాల వారికి తండ్రి వచ్చి సద్గతినిస్తారు. ఇప్పుడు పూర్తి సృష్టిలో రావణ రాజ్యముంది. కేవలం లంకలో మాత్రమే కాదు. సూర్యవంశ రాజ్యమున్నప్పుడు ఈ వికారాలుండేవి కావు. భారతదేశము నిర్వికారిగా ఉండేది. ఇప్పుడు వికారిగా అయిపోయి ంది. అందరూ నరకవాసులుగా ఉన్నారు. సత్యయుగంలో ఉండిన దైవీ సంప్రదాయము వారే 84 జన్మలను అనుభవించి మళ్ళీ ఆసురీ సంప్రదాయస్థులుగా అయ్యారు. మళ్ళీ దైవీ సంప్రదాయము వారిగా తయారవ్వాలి. భారతదేశంచాలా ధనవంతమైనదేశంగా ఉండేది. ఇప్పుడు పేద దేశమైపోయింది. కనుక భిక్ష వేడుకుంటూ ఉంది. తండ్రి పేద పిల్లలైన మీకు ‘ పిల్లలారా! మీరు చాలా సుఖంగా ఉండేవారు’ అని స్మృతిని ఇప్పిస్తున్నారు. మీలాంటి సుఖము వేరెవ్వరికీ లభించజాలదు. భూమి, ఆకాశము అన్నీ మీ చేతిలో ఉండేవి. శాస్త్రాల లో కల్పము ఆయువు ఎక్కువగా వ్రాసేసి అందరినీ కుంభకర్ణుని ఆసురీ నిద్రలో

నిద్రపుచ్చారు. శివబాబా స్థాపన చేసిన ఈ భారతదేశం శివాలయంగా ఉండేది. అక్కడ పవిత్రత ఉండేది. ఆ కొత్త ప్రపంచంలో దేవీ దేవతలు రాజ్యము చేసేవారు. రాధా-కృష్ణులకు పరస్పరంలో ఏం సంబంధముందో కూడా మనుష్యులకు తెలియదు. ఇరువురు వేరు వేరు రాజధానులకు చెందినవారు. స్వయంవరం తర్వాత లక్ష్మీనారాయణులుగా అయ్యారు. ఈ జ్ఞానము ఏ మనుష్య మాత్రులలోనూ లేదు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కేవలం తండ్రి మాత్రమే ఇస్తారు. ఇప్పుడు తండ్రి చెప్తున్నారు -



'ఆత్మాభిమానులుగా అవ్వండి', మీ పరమపితనైన నన్ను స్మృతి చేయండి. స్మృతి ద్వారానే తమోప్రధానం నుండి సతోప్రధానంగా అవుతారు. మనుష్యుల నుండి దేవతలుగా లేక పతితుల నుండి పావనులుగా అయ్యేందుకే మీరు ఇక్కడకు వస్తారు. ఇప్పుడిది రావణ రాజ్యం. భక్తిలో రావణ రాజ్యం ప్రారంభమౌతుంది. భక్తి చేసేవారందరూ రావణుని గుప్పిట్లో ఉన్నారు. పూర్తి ప్రపంచంలోని వారందరూ 5 వికారాల రూపీ రావణుని ఖైదులో ఉన్నారు, శోకవాటికలో ఉన్నారు. తండ్రి వచ్చి అందరినీ విడుదల చేసి మార్గదర్శకులుగా అయి జతలో తీసుకెళ్తారు. అందుకొరకే ఈ మహాభారత యుద్ధము జరుగుతుంది. ఇది 5 వేల సంవత్సరాల క్రితం కూడా జరిగింది. ఇప్పుడు తండ్రి మళ్ళీ స్వర్గాన్ని తయారుచేస్తున్నారు. ఎవరి వద్ద ధనము ఎక్కువగా ఉందో వారు స్వర్గంలో ఉన్నారని భావించకండి. ఇప్పుడు ఉన్నదే నరకము. పతితపావనుడని తండ్రినే అంటారు, నదిని కాదు. ఇదంతాభక్తిమార్గము. ఈ విషయాలను తండ్రియే వచ్చి అర్థం చేయిస్తారు. ఒకరు - లౌకిక తండ్రి, రెండవవారు

- పారలౌకిక తండ్రి, మూడవవారు- అలౌకిక తండ్రి అని మీకు తెలుసు. ఇప్పుడు పారలౌకిక తండ్రి అయిన శివబాబా బ్రహ్మ ద్వారా బ్రాహ్మణ ధర్మాన్ని స్థాపిస్తారు. బ్రాహ్మణులను దేవతలుగా చేసేందుకు రాజయోగాన్ని నేర్పిస్తారు. ఆత్మనే పునర్జన్మలు తీసుకుంటుంది. నేను ఒక శరీరాన్ని వదిలి మరొక శరీరాన్ని తీసుకుంటానని ఆత్మనే చెప్తుంది. తండ్రి చెప్తున్నారు - స్వయాన్ని ఆత్మగా భావించి తండ్రినైన నన్ను స్మృతి చేసే మీరు పావనంగా అవుతారు. ఏ దేహధారినీ స్మృతి చేయకండి. ఇప్పుడు మృత్యులోకము అంతమయ్యే సమయము. అమరలోకము స్థాపనవుతూ ఉంది. మిగిలిన అనేక ధర్మాలు సమాప్తమైపోతాయి. సత్యయుగంలో ఒకే దేవీ దేవతా ధర్మము ఉండేది. తర్వాత చంద్ర వంశానికి చెందిన సీతా-రాములు త్రేతా యుగంలో ఉండేవారు. పిల్లలైన మీకు పూర్తి చక్రాన్ని స్మృతినిప్పిస్తారు. తండ్రియే శాంతిధామము, సుఖధామాలను స్థాపన చేస్తారు. మనుష్యులు మనుష్యులకు సద్గతినివ్వలేరు. వారందరూ భక్తిమార్గములోని గురువులు.

ఇప్పుడుమీరు ఈశ్వరీయ సంతానము. తండ్రి నుండి రాజ్య భాగ్యముతీసుకుంటున్నారు. ఈ రాజధాని స్థాపనవుతూ ఉంది. ప్రజలు చాలామంది తయారవ్వాలి. కోటిలో కొందరు మాత్రమే రాజులుగా అవుతారు. సత్యయుగాన్ని పుష్పాలతోట అని అంటారు. ఇది ముళ్ళ అడవి. రావణరాజ్యము పరివర్తనౌతూ ఉంది, వినాశనం జరగాలి. ఈ జ్ఞానము ఇప్పుడు మీకు లభిస్తోంది. లక్ష్మీనారాయణులకు ఈ జ్ఞానముండదు. ప్రాయ: లోపమైపోతుంది. భక్తి మార్గంలో తండ్రిని ఎవ్వరూ యదార్థంగా తెలుసుకోరు. తండ్రి రచయిత. బ్రహ్మ, విష్ణు, శంకరులు కూడా వారి రచన. సర్వవ్యాపి అని చెప్పడం ద్వారా వారసత్వ హక్కు సమాప్త మైపోతుంది. తండ్రి వచ్చి అందరికీ వారసత్వమునిస్తారు. ఎవరు మొట్టమొదటసత్య యుగంలో వస్తారో వారే 84 జన్మలు తీసుకుంటారు. క్రైస్తవులు 40 జన్మలు తీసుకొని ఉండవచ్చు. ఒక్క భగవంతుని వెతికేందుకు ఎన్ని ఎదురుదెబ్బలు తింటారు. ఇప్పుడు మీరు ఎదురుదెబ్బలు తినరు. ఒక్క తండ్రిని స్మృతి చేస్తే తమోప్రధానము నుండి సతోప్రధానంగా అవుతారు. ఇది యాత్ర. ఇది ఈశ్వరీయ విశ్వ విద్యాలయము. మీ ఆత్మ చదువుతూఉంది. ఆత్మ నిర్లేపి అని సాధు సన్యాసులు అనేస్తారు. కానీ ఆత్మనే కర్మల అనుసారము మరొక జన్మ తీసుకుంటుంది. ఆత్మనే మంచి-చెడు కర్మలు చేస్తుంది. ఇప్పుడు కలియుగంలో మీ కర్మలు వికర్మలుగా అవుతాయి. సత్యయుగంలో మీ కర్మలు అకర్మలుగా ఉంటాయి. అక్కడ వికర్మలు జరగవు. అది పుణ్యాత్మల ప్రపంచము. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. ఒక్క తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకోవాలి. శ్రేష్ఠ కర్మలు చేయాలి. తండ్రి లభించిన తర్వాత ఎలాంటి ఎదురుదెబ్బలు తినరాదు.

2. తండ్రి ఏ స్మృతిని ఇప్పించారో, దానిని స్మృతిలో ఉంచుకొని అపారమైన సంతోషంలో ఉండాలి. దేహధారులనెవ్వరినీ స్మృతి చేయరాదు.

వరదానము :- " 'నిమిత్తుడను' అనే స్మృతి ద్వారా మీ ప్రతి సంకల్పం పై అటెన్షన్ (గమనం) ఉంచుకునే నివారణ స్వరూప భవ "

నిమిత్తంగా ఉన్న ఆత్మలపై అందరి దృష్టి ఉంటుంది. అందువలన నిమిత్తంగా అయ్యేవారికి విశేషంగా తమ ప్రతి సంకల్పముపై అటెన్షన్ ఉంచుకోవలసి వస్తుంది. ఒకవేళ నిమిత్తంగా అయిన పిల్లలు కూడా ఏదైనా కారణాన్ని వినిపిస్తే వారిని అనుసరించే వారు కూడా అనేక కారణాలు వినిపిస్తారు. ఒకవేళ నిమిత్తంగా అయ్యే వారిలో ఏదైనా లోపముంటే, అది దాగి ఉండలేదు. అందువలన విశేషంగా తమ సంకల్పాలు, మాటలు, కర్మలపై గమనమిచ్చి నివారణ స్వరూపులుగా అవ్వండి.

స్లోగన్ :- " ఎవరికైతే తమ గుణాలు లేక విశేషతలను గురించి కూడా అభిమానముండదో, వారే జ్ఞానయుక్త ఆత్మలు "

## మాతేశ్వరిగారి అమూల్యమైన మహావాక్యాలు

1. మనుష్యుల లక్ష్యమేది? ఆ లక్ష్యాన్ని ప్రాప్తి చేసుకునే యథార్థమైన విధి -

తమ జీవితాన్ని మంచిగా చేసుకునేందుకు ఉచితమైనది ఏదని ప్రతి మనిషి తప్పకుండా ఆలోచించాలి. మానవ జీవితం ఎందుకు? అందులో ఏం చేయాలి? ఇప్పుడు నా జీవితంలో పరివర్తనజరుగుతూ ఉందా? అని మీ హృదయాన్ని మీరు ప్రశ్నించుకోండి. మనుష్య జీవితంలో మొదట జ్ఞానం అవసరము. తర్వాత ఈ జీవితంలో లక్ష్యమేదో తెలియాలి? ఈ జీవితంలో సదా సుఖము, శాంతి కావాలని అందరూ అనుకుంటారు, కోరుకుంటారు. ఇప్పుడవి లభిస్తున్నాయా? ఈ ఘోర కలియుగంలో దుఃఖము, అశాంతి తప్ప వేరేమీ లేవు. ఇప్పుడు సుఖము, శాంతి ఎలా లభిస్తాయో ఆలోచించాలి? సుఖము, శాంతి అని వెలువడిన ఈ రెండు శబ్దాలు, ఈ ప్రపంచంలో ఎప్పుడో ఉండి ఉంటాయి. అందుకే ఈ రెండు కావాలని కోరుకుంటారు. ఒకవేళ ఎవరైనా మేము అటువంటి ప్రపంచాన్ని చూడనే లేదు మరి అటువంటి ప్రపంచంఉందని మీరు ఎలా అంగీకరిస్తారు? అని అన్నారంటే వారికి ఇలా అర్థం చేయించాలి - పగలు, రాత్రి అనే రెండు శబ్దాలు ఏవైతే ఉన్నాయో అవి తప్పకుండా రాత్రి పగలు ఉన్నాయి కనుకనే నడుస్తున్నాయి కదా. మేము రాత్రినే చూశాము, పగలు ఉందని ఎలా అంగీకరించాలి ? అని ఎవ్వరూ అనరు. కాని రెండు పేర్లు ఉన్నప్పుడు, వాటి పాత్ర కూడా ఉంటుంది కదా ? అలాగే మనం కూడా

‘ఈ కలియుగం కంటే ఉన్నతమైన స్థితి కూడా ఉండేది, అది సత్యయుగమనిపిలవబడేది ’ అని విన్నాము. ఒకవేళ ఇలాంటి సమయమే అప్పుడు కూడా నడిచి ఉంటే ఆ సమయానికి సత్యయుగమనే పేరు ఎందుకు ఇవ్వబడింది. కనుక ఈ సృష్టి తన స్థితిని మార్చుకుంటూ ఉంటుంది. ఎలాగైతే కిశోర, బాల, యువ, వృద్ధ.... అవస్థలు మారుతూ ఉంటాయో అలా ఈ సృష్టి కూడా మారుతూ ఉంటుంది. ఈనాటి జీవితానికీ, ఆ నాటి జీవితానికి ఎంతో తేడా ఉంది. కనుక అలాంటి శ్రేష్ఠమైన జీవితాన్ని తయారు చేసుకునేందుకు ప్రయత్నం చేయాలి.

## 2. నిరాకార ప్రపంచము, ఆకారి ప్రపంచము మరియు సాకార ప్రపంచాల విస్తారము

ఈ బ్రహ్మాండంలో మూడు ప్రపంచాలున్నాయి. మొదటిది - నిరాకార ప్రపంచము, రెండవది - ఆకారి ప్రపంచము, మూడవది - సాకార ప్రపంచము. నిరాకార సృష్టిలో ఆత్మలు నివసిస్తాయని, సాకార సృష్టిలో సాకార మనుష్యులు నివసిస్తారని ఇప్పుడు తెలుసుకున్నారు. ఇక మిగిలింది ఆకార సూక్ష్మ సృష్టి. ఈ ఆకార సృష్టి సదా ఉంటుందా లేక కొంత సమయం మాత్రమే దీని పాత్ర నడుస్తుందా అనే ఆలోచన వస్తుంది. ప్రపంచంలోని మనుష్యులు సూక్ష్మ ప్రపంచం పైన ఉందని, అక్కడ ఫరిస్తాలుంటారని, దానినే స్వర్గమని అంటారని, అక్కడకెళ్ళి సుఖాలు అనుభవిస్తారని భావిస్తారు. కాని ఇప్పుడు స్వర్గము, నరకము రెండూ ఈ సృష్టిలోనే ఉంటాయని స్పష్టమయింది. సూక్ష్మ ఆకారి సృష్టి, ఎక్కడైతే శుద్ధమైన ఆత్మలు సాక్షాత్కారమవుతాయో, అది ద్వాపరం నుండి ప్రారంభమౌతుంది . భక్తిమార్గం ప్రారంభమైనప్పుడు నిరాకార సృష్టి, సాకార సృష్టి సదా ఉండనే ఉంటాయని ఋజువయింది. సూక్ష్మ ప్రపంచం సదా ఉంటుందని అనము, అందులో కూడా ముఖ్యంగా బ్రహ్మా, విష్ణువు, శంకరుల సాక్షాత్కారం మనకు ఈ సమయంలోనే జరుగుతుంది. ఎందుకంటే ఈ సమయంలోనే పరమాత్మ 3 కర్తవ్యాలు చేసేందుకు, మూడు రూపాలు రచిస్తారు. అచ్ఛా. ఓంశాంతి.

-: ఓంశాంతి :-